## నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించాలి


విద్యార్థులకు అలెండేజర్ ట్యాబ్లెట్స్‌ని వేస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

**కీసర, ఆగస్టు4, ప్రభాతవార్త:**
పిల్లలకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని బిల్లి బియర్స్ పాఠశాల విద్యార్థులకు అలెండేజర్ టాబ్లెట్స్‌ని వేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పరాన్నజీవుల ఇన్‌ఫెక్షన్ రేటును తగ్గించడం, పేగు పురుగుల నిర్మూలన, సాయిల్ ట్రాన్‌మిటెడ్ హెల్మింథెస్ అని కూడా పిలుస్తారన్నారు. 1 నుండి 19 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాల వేదిక ద్వారా మొత్తంగా సమాజంలో అంటువ్యాధుల వ్యాప్తిని తగ్గించడానికి ప్రధాన లక్ష్యంతో పాటిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా


రాంపల్లిదాయర తూముకుంట నరసింహ్మ కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తున్న వార్డు సభ్యులు కందాడి శ్రీకాంత్‌రెడ్డి

**కీసర, ఆగస్టు4, ప్రభాతవార్త:**
నాగారం మున్సిపల్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న తూముకుంట నరసమ్మకు అనారోగ్య సమస్య కారణంగా పక్షవాతం రావడంతో విషయం తెలుసుకున్న చైర్మన్ వారి కుటుంబానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**రాంపల్లిదాయర గ్రామంలో...**
రాంపల్లిదాయర గ్రామానికి చెందిన ప్రజలకు ప్రజా సేవ చేయడానికి ఎల్లప్పుడూ ముందుంజలో ఉంటానని 1వ వార్డు సభ్యులు కందాడి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాంపల్లిదాయర గ్రామంలో తూముకుంట నరసింహ్మ కుటంబానికి ఇటీవల అనారోగ్యంతో మరణించారని తెలుసుకుని వారి కుటుంబానికి 10 వేల రూపాయల అర్థిక సహాయం అందజేశారు. కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యులు కందాడి వెంకట్‌రెడ్డి వారి కుటుంబానికి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముక్క మహేందర్, మామిల్ల చంద్రకళ, బోక్య విజయ, నాయకులు దూసరి సాయిగౌడ్, గంగి ఆంజనేయులు, చొక్కపురం రాజు, మామిడి యాదగిరి, గంగి నరసింహ్మా, బిట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పన: పావని

**ఘట్‌కేసర్, ఆగస్టు 4, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ తెలిపారు. 16వ వార్డులోని బాలాజీనగర్‌లో రూ.10 లక్షలతో చేపడుతున్న భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ కమీషనర్ సాబేర్‌అలీతో కలిసి ఆమె ప్రారంభించారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా మున్సిపల్ నుంచి రూ.10 లక్షలు కేటాయించి యుజిడిని చేపడుతున్నామని పేర్కొన్నారు. చైర్‌పర్సన్, కమీషనర్‌లు కొబ్బరికాయలు కొట్టి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. బాలాజీనగర్‌లో సీసీ రోడ్లు, బీటీ రోడ్డు కూడా వేసేందుకు నిధులు కేటాయిస్తామని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ రాజేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీ, స్వచ్ఛసర్వేక్షణ్ ఇంచార్జ్ యోగేశ్, వార్డు ఇంచార్జ్ ఐలేష్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, నాయకులు హబీబ్, రమేశ్, జహంగీర్, గోరేమియా, ముత్యాలు, ఫయిమ్, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి నిధులు అందజేత


కొండాపూర్ దేవాలయ అభివృద్ధికి నిధులు అందజేస్తున్న సీఎంఆర్ హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి

**ఘట్‌కేసర్, ఆగస్టు 4, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని దేవాలయాల అభివృద్ధికి అవసరమైన నిధులను మల్లారెడ్డి సేవాట్రస్ట్ ద్వారా ఇస్తున్నామని సీఎంఆర్ హెల్త్‌సిటీ చైర్మన్ డాక్టర్ చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన కొండాపూర్‌లోని నల్లపోచమ్మ, ఎర్రపోచమ్మ దేవాలయాలకు రంగులు వేసి, సుంధరీకరణ పనులు చేయడానికి ఆలయ కమిటీ నాయకులు అవసరమైన నిధులను అందజేశారు. అంతకు ముందు శివారెడ్డిగూడ మారుతీనగర్‌లోని పోచమ్మ దేవాలయాన్ని పరిశీలించి సీసీ రోడ్డు, ఫ్లోరింగ్ పనులను పర్యవేక్షించారు. ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీల విజ్ఞప్తి మేరకు గ్రామదేవతల ఆలయాలను అభివృద్ధి పరుస్తున్నామని భద్రారెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైఎస్‌చైర్మన్లు పలుగుల మాధవరెడ్డి, నానావత్ రెడ్డియానాయక్, బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌బిఎస్ జిల్లా సభ్యులు డొంకెన బిక్షపతిగౌడ్, కౌన్సిలర్ బండారి అంజనేయులుగౌడ్, మాజీ ఎంపిటిసిలు మేకల నర్సింగ్‌రావు, చిల్కూరి గోపాల్‌రెడ్డి, మండలబీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, కీసరగుట్ట మాజీ డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, వార్డుసభ్యులు బొడిగె శ్రీనివాస్, మాజీ వార్డుసభ్యులు కొంతం లక్ష్మారెడ్డి, నాయకులు బర్ల హరశంకర్, మండడి శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం రవికాంత్‌రెడ్డి, ఎం.సంజీవ, పోచయ్య, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

### వినియోగదారులకు ఇష్టమైనవి అందించడమే లక్ష్యం

**శంషాబాద్ ఆగస్టు4, ప్రభాతవార్త :** వర్షా కాలం కొనసాగుతున్న నేపథ్యంలో 1 నుండి 7 ఆగస్టు వరకు సూపర్ వేల్యూ డేస్‌తో పాటు ఆగస్టు మెగా ఫెస్టివల్ సమయంలో పొందడానికి కస్టమర్స్ కోసం అమేజాన్ ఫ్రెష్ ఉత్తేజభరితమైన ఆఫీర్స్‌ను ప్రారంభించింది. సుమారు రూ.1లక్ష విలువ గల బహుమతి గెలవడానికి షాపింగ్ చేయండి అవకాశం పొందాడని కస్టమర్స్ తమకు ఇష్టమైన వంటకాలను ఆస్వాదించవచ్చు మరియు నిత్యావసరాలు ,ప్యాకేజ్డ్ ఆహారాలు, ఎన్నో ఉత్పత్తులపై 45శాతం వరకు తగ్గింపుతో అవసరమైన వాటిని తీసుకొవచ్చుని వెల్లడించింది.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలి: వజ్రేశ్

**-గ్రామాల యువజన కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం**
**-మండల పూర్తిస్థాయి కార్యవర్గం ఎంపిక**


గ్రామాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం అనంతరం శాలువాలతో సన్మానిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్

**ఘట్‌కేసర్, ఆగస్టు 4, ప్రభాతవార్త:**
విద్యార్థి, యువజన సమస్యలపై యూత్ కాంగ్రెస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్ మండలంలోని 11 గ్రామాలకు యువజన కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కేశపావుల వినోద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో గ్రామాల్లో యువజన కాంగ్రెస్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు అధ్యక్షులను నియమించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు కొత్త శశాంత్‌గౌడ్‌ల సమక్షంలో ఎంపికైన నూతన అధ్యక్షులను టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ శాలువాలతో సన్మానించారు. మండల యువజన కాంగ్రెస్ పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కె.వినోద్‌కుమార్ కాగా ఉపాధ్యక్షులుగా అంబటి అజయ్, ప్రధానకార్యదర్శిగా కృష్ణ, కార్యదర్శిగా రాజీవ్, సంయుక్త కార్యదర్శిగా శ్రావణ్, సోషల్‌మీడియా కన్వీనర్‌గా శివకుమార్‌లను నియమించారు. కాగా చౌదరిగూడ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మంచాల ధన్‌రాజు, ఎదులాబాద్‌కు ఎం.బాలక్రిష్ణ, కొర్రెముల పాండురంగచారీ, అవుషాపూర్ సి. క్రిష్ణ, కాచవానిసింగారంకు పర్వతం రఘుచారీ, అంకుశాపూర్‌కు నితీష్‌రెడ్డి, ప్రతాపసింగారంకు భానుప్రకాష్, వెంకటాపూర్‌కు సాయికుమార్, ఘణాపూర్‌కు దేవిసింగ్‌నాయక్, మాధారంకు దిలీప్, మర్రిపల్లిగూడ అధ్యక్షులుగా ఎండి.షఫీలను నియమించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ తోటకూర అజయ్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లె బాబురావుగౌడ్, ప్రధానకార్యదర్శి మెట్టు నర్సింహ్మా, కిసాన్‌సెల్ అధ్యక్షులు బొంత రాజిరెడ్డి, సహకార సంఘం డైరక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, గ్రామ కమిటీల అధ్యక్షులు కట్ట అంజనేయులు, బైండ్ల జంగయ్య, సామల అమర్, ప్రసాద్, సల్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

**-స్వచ్ఛసర్వేక్షణ్ ఓటింగ్‌పై అవగాహన**


కొండాపూర్ విజ్ఞాన్ కళాశాలలో స్వచ్ఛసర్వేక్షణ్ ఓటింగ్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**
ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రతను పాటించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లోని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్వచ్ఛసర్వేక్షన్ ఓటింగ్ నమోదుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి రెండుసార్లు కేంద్రప్రభుత్వం నుంచి స్వచ్ఛసర్వేక్షన్ అవార్డు రాగా ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థినులతో చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్ మాట్లాడుతూ మనం తినే, తాగే పదార్థాలు, పీల్చే గాలిలో మైక్రోప్లాస్టిక్ అవశేషాలు ఉంటున్నాయని తాజా పరిశోధనల్లో తేలిందన్నారు. ప్రతి చోట్ల, దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయిందని దీంతో మనిషి ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నదని పర్యావరణ దెబ్బతింటుందని ఆమె తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయకూడదని దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావునాయుడు, మాజీ ఎంపిటిసి చిలూకూరి గోపాల్‌రెడ్డి, పర్యావరణ ఇంజనీర్ రాజేశ్, స్వచ్ఛసర్వేక్షణ్ ప్రత్యేక అధికారి యోగేశ్, వర్క్ఇన్‌స్పెక్టర్ సన్నీ, బిల్‌కలెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో సర్కార్ విఫలం

**-ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి**
**-ఘట్‌కేసర్‌లో ఏఐవైఎఫ్ నిరసన**


ఘట్‌కేసర్‌లో నిరసనర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 4, ప్రభాతవార్త:**
రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,753 కోట్ల ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భోధనా రుసుము, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఏఐవైఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో బస్‌టెర్మినల్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసి నిరుద్యోగభృతి, రియంబర్స్‌మెంట్ మంజూరు చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ, విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడుస్తున్నా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో సర్కార్ విఫలమైందని, పోటీపరీక్షల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిఎస్‌పిఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజ్‌లకు పాల్పడుతూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు రూ.3,116లు నిరుద్యోగభృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల రియంబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, నిరుద్యోగభృతిపై అసెంబ్లీలో సీఎం కేఆర్‌ఎస్ ప్రకటన చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బైగ సల్మాన్, టి.సత్యప్రసాద్, మండల అధ్యక్షులు బాబు, కార్యదర్శి సంపంగి శివ, నాయకులు మహేందర్, మురళీ, జహంగీర్, కిరణ్, సచిన్, దీప్తి, నర్మద, రహీనా, కుమారీ పాల్గొన్నారు.

## సాంకేతికత, యాప్, వెబ్ అభివృద్ధిపై కార్యశాల


ఏయూలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న కార్యక్రమ సంచాలకులు, అధ్యాపకులు, విద్యార్థులు

**ఘట్‌కేసర్, ఆగస్టు 4, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో కృత్రిమ మేధస్సు విభాగం ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, యాప్, వెబ్ అభివృద్ధి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎలిటెస్లర్ సాంకేతికం సీఈఓ ఎ.సాయికృష్ణ ముఖ్యఅతిధిగా విచ్చేసి మాట్లాడారు. హెచ్ఓడీ మల్లికార్జున్‌రెడ్డి విద్యార్థులు అభివృద్ధి పథం వైపు పయనించాలని సూచించారు. కార్యక్రమ సంచాలకులు ప్రదీప్‌కుమార్ నిర్వహించి అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. యాప్ అభివృద్ధి, వెబ్ అభివృద్ధి పద్ధతులను వివరించారు. ఈకార్యక్రమంలో పలు సమస్యల నివేదికను ఇచ్చి విజేతలకు ఇంటర్న్‌షిప్ ఇస్తాం అని చెప్పారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బత్తుల శ్రీనివాస్**

**హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు4, ప్రభాతవార్త**
ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బత్తుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున పట్టణ కేంద్రం లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట తమ పార్టీ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో బెన్ షాలోమ్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తీవ్రంగా నష్టపోయారని నష్టం జరుగుతుందని తెలిసినా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. అంతే కాకుండా పట్టణ కేంద్రంలో రహదారులన్ని పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు పరిహారం అందించడంతో పాటు దగ్ధమైన రహదారులను బాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ మండల అధ్యక్షులు మామిడి తిరుపతి, వరియోగుల శ్రీనివాస్, కార్యదర్శులు బత్తుల శంకర్, బైరి శ్రీనివాస్, నాయకులు ఎండి హస్సన్, ఆకుల వెంకటేష్, వీరయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### నేడు వ్యవసాయ శాస్త్రవేత్తల రాక

**కొల్చారం, ఆగస్టు4 ప్రభాతవార్త:** నేడు (శనివారం) ఉదయం 8 గంటలకు తునికి రామానాయుడు అగ్రికల్చర్ కళాశాలకు సంబంధించిన శాస్త్రవేత్తలు వరి పంటలో చీడపీడల నివారణకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి మండల కేంద్రమై కొల్చారం గ్రామానికి వస్తున్నారు. గ్రామ రైతులందరూ హాజరు కావాలని వ్యవసాయ అధికారులు కోరారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

**మిరుదొడ్డి, అగస్టు 4, ప్రభాతవార్త :** ఈనెల 7న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ అండర్ 14 విభాగంలో జావలిన్ త్రో బి.వెన్నెల అండర్ 16 విభాగంలో జావలిన్ త్రో, వంద మీటర్స్‌లో వెంకటేష్‌లు ఎంపికైనట్లు పీఈటీ వెంకట్‌రెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనా విద్యార్థులను పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

### మణిపూర్‌లో అల్లర్లు ఆగాలని.. మెదక్ చర్చిలో జడ్పీటిసి ప్రార్థనలు

**న్యాల్‌కల్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** మణిపూర్‌లో కొనసాగుతునన హింసలు అదుపులోకి వచ్చేలా ఆశీర్వదించాలని జడ్పీటిసి సభ్యురాలు బోడ స్వప్న భాస్కర్ శుక్రవారం మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీటిసి సభ్యురాలు స్వప్న భాస్కర్ మాట్లాడుతూ ప్రభువు దయ చూపులతో మణిపూర్‌లో అల్లర్లు అదుపులోకి వచ్చి అందరూ సోదర, స్నేహ భావాలతో ఉండేలా కరుణించాలని ఏసుప్రభువును వేడుకున్నట్లు పేర్కొన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణఖాండ ఆగేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

## పంచాయతీ కోసం తండాలోని గిరిజనానికి అనువైన స్థలాన్ని గుర్తిస్తాం

**అక్కన్నపేట తహసీల్దార్ సంజీవ్‌కుమార్**

**అక్కన్నపేట, ఆగస్టు4, ప్రభాతవార్త**
మండలంలోని మైసమ్మవాగుతండా పంచాయితీ నిర్మాణం అక్కడి గిరిజనానికి దూరంగా ఉంటుందని అక్షేపణలు తెలిపిన విషయంపై శుక్రవారం ప్రభాతవార్త కథనం ప్రచురించిన విషయంపై తక్షణమే అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సంజీవ్‌కుమార్ స్పందించి గిరిజనానికి అనువైన స్థలంలోనే స్థలాన్ని గుర్తించి పంచాయితీ భవన నిర్మాణం చేపట్టేందుకు అనుమతినిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం ఈ విషయంపై స్పందించిన ఎంపిడివో సత్యపాల్‌రెడ్డి తహసీల్దార్ స్థలాన్ని కేటాయించిన అనంతరం తాము నిర్మాణానికి పూనుకుంటామని స్పష్టం చేశారు.

## సీజనల్ వ్యాధులు సోకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి : కౌన్సిలర్

**సిద్దిపేట రూరల్, అగస్టు 4, ప్రభాతవార్త :**
ప్రస్తుత వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉంటుంద ని ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఅనంద్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజుల రాజనర్సు అదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా శుక్రవారం 37వ వార్డులో కౌన్సిలర్ బాల్‌లక్ష్మీఅనంద్ అధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికి తిరుగుతూ కుళాయిలలో, పూల మొక్కల కుండీలలో నిల్వ ఉన్న నీటిని తొలిగించారు. కుళాయిలలో, పూల మొక్కల కుండీలలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని ఎప్పటికప్పుడు నీరు నిల్వ ఉంచకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అరోగ్య, స్వచ్ఛ సిద్దిపేటే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మంత్రి హరీష్ రావు లక్ష్యానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తడి, పొడి, హానికరమైన చెత్తను వేర్వేగా చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని అవగాహన కల్పించినట్లు తెలిపారు. వార్డు ప్రత్యేక అధికారి శ్రీ కాంత్, వార్డు బిఆర్ఎస్ అధ్యక్షులు జక్కుల రాజు, జువ్వన్న ప్రసాద్, బయ్యారం యాదగిరి, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

### స్వాతంత్ర్యం వేడుకల కోసం సిద్ధం చేసింది

**శామీర్‌పేట ఆగస్టు4, ప్రభాతవార్త :** స్వాతంత్ర్యం కోసం వాతావరణాన్ని సిద్ధం చేసిన నెలకు స్వాగతం పలికేందుకు అమెజాన్ ఇండియా గ్రేట్ ఫ్రీడమ్ ఫెస్టివల్‌ని ప్రకటించింది. ఈ సంవత్సరం షాపింగ్ కార్యక్రమం గొప్ప డీల్స్ మరియు ఆఫర్‌లతో 4 ఆగస్టు అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమవుతుంది మరియు ఆగస్టు8 వరకు కొనసాగుతుంది. ప్రైమ్ సభ్యులు ఆగస్టు 3 మధ్యాహ్నం 12 గంటల నుండి 12 గంటల ప్రైమ్ ఎర్లీ యాక్సెస్‌ను పొందుతారు. కస్టమర్‌లు లక్షలాది ఉత్పత్తులపై ఆఫర్‌లను అన్వేషించవచ్చు మరియు తమ స్వచ్ఛను అందుకోవడానికి విస్తృతమైన అవకాశాలు ప్రపంచాన్ని కనుగొనడానికి విస్తృతమైన ఎంపిక నుంచి షాపింగ్ చేయవచ్చుని వెల్లడించింది.

### ఘనంగా తల్లిపాలు, అన్న ప్రసన్న వారోత్సవాలు

**కోహెడ, ఆగస్టు 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రగుంటపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అన్న ప్రసన్న కార్యక్రమంతో పాటు తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, అంగన్‌వాడీ టీచర్ ఖమ్మం రమాదేవి, అయా నాగు రాజేశ్వరి, రజిత, నాగు అఖిల, చిట్యాల ముత్తవ్వ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూర్ ఎంపిపిగా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్‌రెడ్డి


కొత్తూర్ ఎంపీపీగా మళ్లి బాధ్యతలు చేపట్టిన పిన్నింటి మధుసూదన్‌రెడ్డి

**కొత్తూర్, ఆగస్టు 4. ప్రభాతవార్త :**
కొత్తూర్ మండల పరిషత్ అధ్యక్షుడిగా పిన్నింటి మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా ఆయన ఓ కేసు విషయంలో రిమాండ్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో వైస్ ఎంపీపీగా ఉన్న శోభలింగంనాయక్‌ను ప్రభుత్వం ఇంచార్జ్ ఎంపీపీగా నియమించారు. శుక్రవారం మండల పరిషత్ అధికారి శరత్‌చంద్రబాబు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

## అంగడిరైచూర్‌లో తల్లిపాల వారోత్సవాలు


అంగడిరైచూర్‌లో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

**కొడంగల్, ఆగష్టు 4ప్రభాతవార్త**
ఐసీడీఎస్ కొడంగల్ ప్రాజెక్టు పరిధిలోని అంగడిరైచూర్ అంగన్‌వాడీ కేంద్రాల అద్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల అద్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దాసమ్మ ప్రభలు మాట్లాడుతు తల్లిపాల వారోత్సవాలపై విపులంగా వివరించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. ముర్రుపాలు త్రాగించడంతో బిడ్డ ఆరోగ్యంగాను భవిష్యత్తులో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు రత్నమ్మ, రజిత, సుశీలతో పాటు చంటిపిల్లల తల్లులు అంగన్‌వాడీ విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది

**-మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,ఎంపిటిసి సురేందర్**


మన్నెగూడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ తదితరులు

**పూడూరు, ఆగష్టు 4, ప్రభాతవార్త :**
సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మండల కాంగ్రెస్‌పార్టీ అద్యక్షుడు, ఎంపిటిసి సురేందర్, జిల్లా యువజన కాంగ్రెస్‌పార్టీ అద్యక్షుడు, పిఎసిఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఏఐసిసి అగ్రనాయకుడు, ఎంపి రాహుల్‌గాంధీపై అక్రమకేసులతోపాటు భారతీయ జనతాపార్టీ వేసిన పరువునష్టం దావాపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై గురువారం సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్బంగా పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నియంత్రుత్వ విధానాలను ఎండగడుతున్నాడన్న అక్కసుతోనే కాంగ్రెస్‌పార్టీ జాతీయనేత రాహుల్‌గాంధీపై పరువునష్టం దావా బీజేపీ ప్రభుత్వం వేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపిటిసి లక్ష్మణ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అజీంపటేల్, నాయకులు రహీంభాయ్, శేఖర్, భీమన్న, సికిందర్, సుభాష్, నవీన్, శేఖర్ పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమాన్ని విస్మరించకూడదు : ఎంపిపి

**ఘట్‌కేసర్, ఆగష్టు 4, ప్రభాతవార్త:**
గత 28 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఆయన కార్మికులతో కలిసి సమస్యలు పరిష్కరించేలా సీఎం కేసీఆర్‌కు జ్ఞానోధయం కల్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్బంగా గాంధీ విగ్రహం ముందు ఆయన బైఠాయించి ధర్నా చేశారు. గ్రామాల్లో పారిశుద్య పనులు చేస్తూ ఏళ్ల తరబడి వెట్టిచాకిరి చేస్తున్న కార్మికుల ఆస్తులు మోరీలు, రోడ్ల, చెత్తకుప్పలే నని ఆయన పేర్కొన్నారు. 28 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులను పట్టించుకోకుండా సర్కార్ ఆర్టీసీ ఆస్తుల మీద కన్నేసి ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులుగా గుర్తించారని ప్రకటించారని ఆయన దుయ్యబట్టారు. కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డికి సమ్మె కనిపించడం లేదని అంటే ఎంపిపి ప్రశ్నించారు. పారిశుద్య కార్మికులను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగానే గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.

## సుప్రీం కోర్టులో స్టే పట్ల కాంగ్రెస్ శ్రేణుల హర్షం

**కొడంగల్, అగష్టు 4ప్రభాతవార్త**
కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీకి సుప్రీం కోర్టులో స్టే లభించడం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రాహుల్‌గాంధీకి సుప్రీం కోర్టులో స్టే లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొడంగల్ నయ్యూం, సోమశేఖర్, సంజీవ్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్ తదితరులు మాట్లాడుతు రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు వేసిన కేసులో సుప్రీం కోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం గెలిచిందన్నారు. బీజేపీ ప్రభుత్వ కుట్రలు చిత్తయ్యాయని పేర్కొన్నారు. కుట్ర పూరితంగా రాహుల్‌గాంధీ ఎంపీ పదవిపై అనర్హత వేటు వేయడం, అధకారిక నివాసాన్ని ఖాళీ చేయించడం లాంటి చర్యలు దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు పట్ల దేశంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. న్యాయం గెలిచిందని ప్రజల్లో చట్టం, న్యాయం పట్ల మళ్ళీ విశ్వాసం పెరిగిందన్నారు. బీజేపీ కుట్రలను ప్రజలు అర్ధం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ నాయకులు అసీఫ్‌ఖాన్, మదరప్ప, రాము, అశ్వాక్, తార్యానాయక్ పాల్గొన్నారు.


కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## రైతు బీమాను సద్వినియోగం చేసుకోండి


దరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు

**ఆమనగల్లు, ఆగస్టు04, ప్రభాతవార్త:**
రైతులందరూ భీమా సౌకర్యం పొందేందుకు రైతుభీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. భీమా దరఖాస్తుకు ఆగస్టు ఈనెల 5 ఆఖరు తేదీ అని అర్హులైన ప్రతిఒక్కరూ భీమాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. భీమా ప్రీమియంను రైతులకు భారం కాకుండా ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తుందని, తద్వారా రైతుకు 5లక్షల భీమా వర్తిస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారుల ప్రచార ఫలితంగా రైతుభీమాకు మంచి స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభీమా పథకానికి వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు నూతనంగా దరఖాస్తు చేసుకుని శుక్రవారం వ్యవసాయ కార్యాలయం వద్ద అధికారులకు దరఖాస్తు పత్రాలను అందజేశారు. ఈసంధర్భంగా ఏఓ అరుణకుమారి రైతులకు పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో కె.రాణి, మీనాక్షి, శివతేజ, సాయిరాం తదితరులు ఉన్నారు.

## త్వరలోనే దుకాణ సముదాయానికి శంకుస్థాపన


సర్వసభ్య సమావేశంలో చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ తోట గిరియాదవ్, పాలకవర్గ సభ్యులు

**ఆమనగల్లు, ఆగస్టు04, ప్రభాతవార్త:** ఆమనగల్లు మార్కెట్ యార్డు స్థలంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి అనుసంధానంగా దుకాణ సముదాయానికి నిధులు కేటాయించామని, త్వరలోనే నిర్మాణ పనులకు శంఖుస్థాపన కార్యక్రమాలు చేపడుతామని కమిటీ సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం నిర్ణయించింది. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో పాలకవర్గం సర్వసభ్య సమావేశం జరిగింది. చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ తోటగిరియాదవ్‌తోపాటు పాలకవర్గ సభ్యులు, అధికారులు హాజరైనారు. సమావేవంలో వివిధ అంశాలపై సవివరంగా చర్చించారు. పాలనలో తమ మార్కును శాశ్వతంగా ఉండేలా, రైతులకు ప్రయోజనకరంగా ఉండే అంశాలపై చర్చించారు. 8దుకాణాలతో నిర్మించే సముదాయం, సీసీరోడ్లు, గోదాముల మరమ్మతులు, కడ్తాల చెక్‌పోస్టు ప్రారంభోత్సవం, అభివృద్ధి పనులలో అందరం సమన్వయంతో ముందుకు సాగాలని తీర్మానించారు. సమావేశంలో డెరెక్టర్లు సురమళ్ళ సుభాష్, లాయక్ అలీ, రమేశ్‌నాయక్, శేఖర్, కాసుల కృష్ణయ్య, సెక్రటరీ, శ్రీశైలం ఉన్నారు.

## మంచికి మారుపేరు మహేందర్
### -ఆసుపత్రిలో పండ్లు పంచిన జడ్పివైస్ చైర్మన్


ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,

**నందిగామ ఆగస్టు4,ప్రభాతవార్త :**
మృదు స్వభావి,మంచికి మారుపేరుగా నిలిచి సేవా దృక్పథం కలిగి ఉన్న జాంగారి మహేందర్ మన మధ్య లేకపోవడం పార్టీకి తీరని లోటని జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్ కొనియాడారు.బీఆర్ఎస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేసిన జాంగారి మహేందర్ జ్ఞాపకార్థం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు,బెడ్లు, పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహేందర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని వేడుకున్నారు.మహేందర్ సేవలను స్మరిస్తూ రంగాపూర్ సర్పంచ్ ఎనుగొండ రమేష్ గౌడ్ నందిగామ సింగిల్ విండో చైర్మన్ తోట రాజ్ గోపాల్,తోట కృష్ణయ్యలు గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందికి పండ్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో నందిగామ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి తులసి,జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ రాములు, నాయకులు తుప్పుడు నర్సింహ్మ,శివ్వగల్ల రాజు,ఏకుల సంపత్,నర్సింగ్ రావు,తదితరులు ఉన్నారు.

## నందిగామ తహసీల్దార్‌గా మహ్మద్ జహురుద్దీన్

**నందిగామ ఆగస్టు4,ప్రభాతవార్త :**
నందిగామ మండల నూతన తహసీల్దారుగా నల్గొండ జిల్లా వాస్తవ్యుడు మహ్మద్ జహోరుద్దిన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇంతకు ముందు విధులు నిర్వహించిన అబ్దుల్ రహెమాన్ నల్గొండకు బదిలీపై వెళ్లారు.కొత్తగా వచ్చిన ఎమ్మార్వో జహోరుద్దిన్ బాధ్యతలు చేపట్టినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి ఆగస్టు4,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు మైసగల్లా కృష్ణయ్య తండ్రి మైసగల్ల పెద్ద పరశురాములు మృతి చెందాడు.దీంతో బిజెపి నాయకులు వారిని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయంగా 7వేల రూపాయలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బక్కి కుమార్,వార్డు సభ్యులు కృష్ణవేణి,యాదగిరి గౌడ్,రాణి రాజు యాదవ్,రేణుక యాదయ్య,నాయకులు మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్, రాజు యాదవ్,శ్రీశైలం,మనోహర్,వర్సు కుమార్,మైసగల్ల మల్లయ్య,మైసగల జంగయ్య,బండి చెన్నయ్య,తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గోపాల్

**కందుకూరు, అగస్టు 4, ప్రభాతవార్త:**
కందుకూరు మండల తహసీల్దార్ గా కె గోపాల్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కందుకూరు తమసీల్దార్‌గా పనిచేసిన మహేందర్‌రెడ్డి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలానికి బదిలీపై వెల్లగా జిల్లా పరిదిలోని ఫారూక్‌నగర్ మండలం నుండి బదిలీ అయ్యి వచ్చిన గోపాల్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూసమస్యల పరిష్కారంలో ప్రజలకు న్యాయం జరిగేలా చొరవ చూపడం జరుగుతుందని సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలని అయన సూచించారు.


తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కె గోపాల్‌కు స్వాగతం పలికిన సిబ్బంది

# మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్ వ్యాఖలపై బిఆర్ఎస్ ఫైర్

**మేడ్చల్, ఆగస్టు 4. ప్రభాతవార్త :**
మంత్రి మల్లారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ చేసిన వాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం మేడ్చల్‌లో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ.. కష్టపడి పాలు అమ్ముకున్న మంత్రి బ్రోకరా, లేక మేడ్చల్ నియోజకవర్గంలో ప్లాట్లు అమ్మిన వారిని అంటారా ఆలోచించుకోవాలని అని పలువురు నాయకులు ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోతున్న మంత్రి మల్లారెడ్డిపై వాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విదంగా స్వంత నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత మంత్రి మల్లారెడ్డిదేనని అన్నారు. పాలను అమ్ముకున్న డబ్బులతో మంత్రి ప్రజల కోసం పనులు చేస్తున్నారని, ఆయన ఎల్లవేళలా సామాన్యునికి అందుబాటులో ఉంటున్నారని అన్నారు. వైద్య సేవలు, ఆర్థిక సహాయం అందించి ప్రజలకు సేవ చేస్తున్నారని చెప్పారు. కేఎల్ఆర్‌లాగా వ్యాపారం చేసి డబ్బులు కూడబెట్టుకుని వెళ్లిపోయే మనస్తత్వం మంత్రికి లేదని తెలిపారు. ఇలాంటి వాఖ్యలు చేయడం మానుకోవాలని, దమ్ముంటే అభివృద్ధిపై చర్చించడానికి రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విజయనందరెడ్డి, సత్యనారాయణ, బలరాంరెడ్డి, సురేష్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, మహేష్, యూనుష్ పాష తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

## పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



**తలకొండపల్లి ఆగస్టు4,ప్రభాతవార్త :**
పశువులకు తప్పకుండా గాలికుంటు టీకాలు వేయించాలని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...రైతు వారి పశువులకు నటల నివారణ కోసం గాలికుంటు టీకాలు వేయించి పశువుల ఆరోగ్యానికి కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత జ్యోతయ్య,,ఎంపిటిసి హేమ రాజు ,ఉప సర్పంచ్ అనిల్,వెంకటయ్య,చెన్నయ్య,జంగయ్య,డాక్టర్,సిబ్బంది,రైతులు,పాల్గొన్నారు.

## కొత్తూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన జానకి

**కొత్తూర్, ఆగస్టు 4. ప్రభాతవార్త :**
కొత్తూర్ మండల నూతన తహసీల్దార్‌గా కె.జానకి నియమితులయ్యారు. గతంలో కొత్తూర్ మండలం తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన రాములు బదిలీపై వికారాబాద్ వెళ్లారు. ఆస్థానంలో హైదరాబాద్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అర్బన్ ల్యాండ్ సీలింగ్ హైదరాబాద్‌లో తహసీల్దార్‌గా ఉన్న జానకి బదిలీపై కొత్తూర్ తహసీల్దారుగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

### అక్రమ నిర్భందాలు పాలకుల చేతగాని తనానికి నిదర్శనం : సిఐటియు

**కందుకూరు, అగస్టు 4, ప్రభాతవార్త:**
నిర్బందాల ద్వారా ప్రజల గొంతు నొక్కాలని చూడడం పాలకుల అసమర్థతకు నిదర్శనమని సిఐటియు మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ పేర్కొన్నారు. 2వ స్తాయి ఎఎన్ఎం హక్కుల సాదనకోసం నిర్వహించతలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం సిఐటియు మండల కన్వీనర్ తోపాటు పలువురు ఎఎన్ఎం లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యాహ్నం పూచీ కత్తుపైన విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బాల్‌రాజ్ మాట్లాడుతు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని రెండవస్తా యి ఎఎన్ఎంలు డిమాండ్ చేయడం సమంజసమన్నారు. ఒకటవశ్రేని ఎఎన్ ఎంలు పనితక్కువ జీతం ఎక్కువ రూ 90 వేలనుండి 1 లక్ష రూపాయల వరకు తీసుకుంన్నారని వారికన్నా ఎక్కువ పనిచేస్తున్న రెండవ శ్రేనిఎఎన్ఎం లకు రూ 25 వేలు ఇస్తున్నారని పేర్కొన్నారు. అదేవిదంగా పంచాయతీ కార్మికులు ప్రానాలను పనంగా పెట్టి గ్రామాలలో పారిశుద్యం పనులు చేస్తుం టే వారికి పనికి తగ్గ వేతనం అందడం లేదని ఇలా ప్రభుత్వం కింది స్తాయి కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తుందని పంచాయతీ కార్మికులు నెలరోజులుగా సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఎఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు చలో అసెంబ్లీ కార్యాక్రమాన్ని నిర్వహించాలని చూస్తే వారిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు ఇప్పటికైన ప్రభుత్వం కార్మికుల పట్ల కిందిస్తాయి ఉద్యోగుల పట్ల సానుకూ లంగా ఆలోచించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బాలరాజ్ కోరారు.

### నేడు విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలి : ఎఇఇ

**కందుకూరు, అగస్టు 4, ప్రభాతవార్త:** మండల పరిదిలోని రాచులు, ముచ్చర్ల, గ్రామాల పరిదిలోని 33 కెవి సబ్‌స్టేషన్ ల పరిదిలోని విద్యుత్ ఫీడర్‌లలో చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం 5 వతేదీ శనివారం చేపట్ట దం జరుగుతుందని మండల విద్యుత్ ఎఇఇ రమేష్‌గౌడ్ తెలిపారు. ఈ పని వేలలు శనివారం ఉదయం 10.30 గంటల నుండి మద్యాహ్నం 2.30 గంటల వరకు పనులు జరుగుతాయని ఈ సమయంలో రాచులూరు, ముచ్చర్ల విద్యుత్ సబ్ స్టేషన్‌లతో పాటు లేమూరు, గూడూరు, సబ్‌స్టేషన్ ల పరిదిలోను విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని ఈ అంతరా యానికి విద్యుత్ వినియోగ దారులు గమనించి విద్యుత్ సంస్థకు సహకరిచగలరని మండల విద్యుత్ ఎఇఇ కోరారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**షాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.... మండల పరిధిలోని హైతాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా కటేర కంపెనీ ఎదురుగా ఉన్న సబ్‌స్టేషన్ నందు విద్యుత్ పోల్ కోసం తీసిన గుంతలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. అతని వయస్సు సుమారు(40) ఉండవచ్చునని, దుస్తులు గోదుమ రంగు గళ్ల చొక్కా, నలుపురంగు ప్యాంట్, నశం కలర్ ఆప్ బనియాన్, ఎరుపు, నలుపు రంగు షార్ట్, మెడలో పూసలమాల, నలుపు రంగు మొలతాడు, ఎడమ చేతి మణికట్టు వద్ద కాలిన గుర్తులు ఉన్నాయని తెలిపారు. కేసును మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు ఉచిత బస్సుపాసులు పంపిణీ


ఆదర్శ పాఠశాల విద్యార్థులకు బస్సుపాసులు అందించిన చల్లా

**కందుకూరు,ఆగస్టు 4, ప్రభాతవార్త:**
విద్యార్థులు విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా కాగ్రెస్‌పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి పేర్కోన్నారు. శుక్రవారం మండల పరిదిలోని నేదునూరు అదర్షపాఠశాలోని 200 మంది విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసులను వైస్ఎంపిపి జి శమంతప్రభాకర్ రెడ్డి తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు క్రిష్ణానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. ప్రపం చంలో ఏవస్తువునైనా తస్కరించ వచ్చు గాని విద్యను ఎవ్వరు తస్కరించ లేరన్నారు. విద్యధ్వారా విశ్వాన్ని జయించవచ్చని సమాజంలో ఉన్నత స్తానా నికి చేరుకునే అవకాశాలు ఉంటాయన్నారు. పూర్వకాలంలో విద్యావకాశాలు తక్కువగా ఉండేవని నేడు పరిస్తితులు మారాయని అవకాశాలు ప్రజల ముంగిటకు వచ్చాయని కుటుంబ పెద్దలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడానికి ఎంతో వ్యయ ప్రయాసలకు ఒర్చి విద్యాలయాలకు పంపిస్తున్నారని వారు కన్న కళలను నెరవేర్చడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివితే కష్టం కాదని ఒక ప్రణాళికను పెట్టుకుని ఉపా ధ్యాయులు చెప్పె అంశాలను ఎప్పటి కప్పుడు చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో కీర్తి ప్రతిష్టలు గౌరవం చదువుద్వారానే దక్కుతుం దని సూచించారు. విద్యారంగంలో తమవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఇంత చక్కని కార్యాక్రమానికి తమను ప్రోత్సహించిన విద్యార్థులకు సేవచేసుకునే అవకాశం కల్పించిన మహేశ్వరం అర్టీసి డిపో మేనేజర్ మనోహర్‌రెడ్డి కి నేదునూరు, మహేశ్వరం అదర్ష పాఠశాలల ప్రిన్సి పాల్స్ శ్రీదర్, దనుంజయ్ లకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అవుల యాదయ్య, అయిళ్ళ కమలమ్మ, అలె కుమార్‌చ అప్జల్‌బేగ్, కొమురయ్య, గంగారాం, జంగయ్య, చంద్రమో హన్, సుధాకర్, బాలరాజ్, ప్రభు, నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ అన్వర్‌కు సన్మానం


కడ్తాల్ తహసిల్దార్‌ను అన్వర్‌ను సన్మానిస్తున్న ఎంపిటిసి గోపాల్

**కడ్తాల్,ఆగస్టు 04 ప్రభాతవార్త :**
మండల తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్వర్‌ను శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో రావిచేడ్ ఎంపిటిసి బొప్పిడి గోపాల్, నాయకులతో కలిసి పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటి అధ్యక్షుడు బాలకృష్ణ, వార్డుసభ్యులు మల్లేష్‌యాదవ్,పవన్,నాయకులు సాయికుమార్ పాల్గొన్నారు

### బాలికలు నులిపురుగుల మందుల వేసుకోవాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** విద్యార్థులు చేతుల పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాలను నివారించవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆమె బాలికలకు నులిపురుగుల నివారణమందు పంపిణీని ప్రారంభించారు. 5 నుంచి 19 సంవత్సరాల వయస్సు కల్గిన బాలబాలికలకు కడుపులో నులిపురుగులు ఏర్పడే అవకాశం ఉంటుందని ఆరు నెలలకు ఒకసారి మందు వేసుకోవాలన్నారు. చేతుల అపరిశుభ్రత వల్లే నులిపురుగులు వస్తాయని, చేతిగోర్లలో మట్టి చేరకుండా జాగ్రత్త వహించాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో పిహెచ్ఎన్ విమలరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, డాక్టర్ ఫణీంద్ర, ఎఎన్ఎం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక
### -ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
### -లయన్స్ క్లబ్ భవనానికి 200గజాలు కేటాయిస్తాం : ఎమ్మెల్యే


లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4, ప్రభాతవార్త:**
ఇబ్రహీంపట్నం 320సి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు.నూతన సభ్యులు స్థానిక భాతర్ ఫంక్షన్‌హాల్లో ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ సంస్థ మాజి జిల్లా గవర్నర్ లయన్ వెంకటనారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.అదేవిదంగా క్లబ్ సభ్యులు క్లబ్ సామావేశాలు నిర్వహించడానికి సోంత భవనం నిర్మించడానికి స్థలం కావాలని కోరగా వెంటనే క్లబ్ నిర్మాణానికి 200గజాల స్థలాన్ని కేటాయిస్తానని హామీనిచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు చేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు లయన్ ఇందూరి శ్రీనివాస్,కార్యదర్శి లయన్ కె.వి రమేష్ రాజు,కోశాధికారి లయన్ భీంరావులతో ప్రమాణస్వీకారం చేయించారు. క్లబ్ సభ్యులు ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు.కార్యక్రమంలో లయన్ కృష్ణ ప్రసాద్,లయన్ ఇన్నారెడ్డి,లయన్ శ్యామ్ ప్రసాద్,లయన్ కృష్ణకుమార్,లయన్ హరికృష్ణ,ఇన్స్టలేషన్ చైర్మెన్ ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ, యుఆర్ఎస్‌ల ఉద్యోగాలను క్రమబద్దీకరించాలి


డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంఆర్‌సీ సిబ్బంది

**షాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**
విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షా కేజీబీవీ, యుఆర్ఎస్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మినిమమ్ టైమ్ స్కేల్ చేసి ఉద్యోగులుగా క్రమబద్దీకరించాలని సమగ్ర శిక్షా మండల నాయకుడు సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం షాబాద్ డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సమగ్ర శిక్ష, కేజీబీవీ, యుఆర్ఎస్‌లను విద్యాశాఖలో విలీనం చేసి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్దీకరించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరికి మినిమమ్ టైమ్ స్కేలును అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న మహిళా కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. గ్రూప్ ఇన్సు రెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. నగదు రహిత వైద్య సదుపాయం కల్పించి, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. విద్యాశాఖలో చేపట్టే ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో వేయిటేజ్ కల్పించాలన్నారు. మరణించిన, గాయపడిన కాంట్రాక్టు ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు అనిబొసెంట్, లింగం, కృష్ణ, కుమారి, స్వప్నకు మారి, నాగమణి, శ్రీశైలం, వనిత, ఫాతిమా, ప్రభావతి, కనకదుర్గా, యాద య్య, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

## ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత
### -శ్రీరామచంద్రస్వామి ఆలయానికి రూ.5,11,000 భారీ విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

**కొత్తూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**
ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ జిల్లా జడ్పీవైస్ చైర్మెన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి తెలిపారు. కొత్తూర్ మండలంలోని తీగాపూర్ గ్రామంలో నిర్మించతలపెట్టిన నూతన శ్రీరామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి మాజీ జిల్లా జడ్పీవైస్ చైర్మెన్ నాగర్‌కుంట న వీన్‌రెడ్డి తనవంతు సహాయంగా రూ.5,11,000లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళంకు సంబంధించిన చెక్కును సర్పంచ్ రమాదేవిరమేష్, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి ఆలయ నిర్మాణ అభివృద్ధి సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా తీగాపూర్ గ్రామస్థులు మాజీ జిల్లా జడ్పీవైస్ చైర్మెన్ నవీన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రమాదేవిరమేష్, ఎంపీటీసీ కట్న మాధవిరవీందర్, తీగాపూర్ గ్రామ ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ సాయిలు, బాలయ్య, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామయువకులు, ప్రజలు తదితరులు ఉన్నారు.


ఆమనగల్లులో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సిఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్


ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు


సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి


కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జడ్పీటిసి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పరమేష్, ప్రజా ప్రతినిధులు

# రైతు బాంధవుడు కెసిఆర్

**ఆమనగల్లు మండలంలో...**
**ఆమనగల్లు, ఆగస్టు04, ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయమే దండగా అన్నారని, పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో నేడు రైతు రాజుగా విరజిల్లుతున్నాడని మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఏకకాల రైతురుణమాఫీ చేపడుతున్నారని, దీంతో మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుపక్షపాతిగా ముద్రవేసుకున్నారన్నారు. రైతురుణమాఫీ అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ తోట గిరి యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ పాలకవర్గం సంబురాలు నిర్వహించుకున్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞత వ్యక్తం చేశారు. అనంతరం తీవ్ర అనారోగ్యబారిన పడి త్వరగా కోలుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తోటగిరి యాదవ్‌ను చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్లు సురమళ్ళ సుభాష్, రమేశ్‌నాయక్, శేఖర్, లాయక్ అలీ, నిరంజన్, కాసుల కృష్ణయ్య, రాధమ్మవెంకటయ్య, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, యూత్ ప్రెసిడెంట్ వద్దె వెంకటేశ్, సయ్యద్ ఖలీల్, మాసూమ్, వస్పుల సాయిలు, ఎనుముల రమేశ్, సుమన్, కొమ్ము ప్రసాద్, శివ, రమేశ్, యేసయ్య తదితరులు ఉన్నారు.

**జిల్లెడు చౌదరిగూడ మండలంలో..**
**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 04,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గాలిగూడ గ్రామంలో శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు పాలాభిశేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రుణ మాఫీ చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ బిసి సెల్ మండల అధ్యక్షుడు నర్సింహులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవియాదవ్, వెంకటేష్, చంద్రయ్య, పెద్ద వెంకటయ్య, జంగయ్య, మల్లెతష్, బీమయ్య, శ్రీశైలం, యాదయ్య, రామయ్య, చంద్రశేఖర్, రమేష్, అంజి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం మండలంలో..**
**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4, ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ రైతు పక్షపాతి అని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు.ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులకు రుణమాఫీ చేయడం హర్షినియమన్నారు.కార్యక్రమంలో ఎంపిపి కృపేష్,మండల రైతు బంధు అధ్యక్షులు అంజిరెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మెన్ అకుల యాదగిరి,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బుగ్గరాములు,పిఎసిఎస్ చైర్మెన్ సుదార్శన్‌రెడ్డి,మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కడ్తాల్ మండలంలో..**
**కడ్తాల్,ఆగస్టు 4 ప్రభాతవార్త :** రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి పెద్దపీట వేశారని, రైతుల రుణమాఫీ చేస్తున్న సీఎం కెసిఆర్‌కు రైతులు ఎల్లప్పుడు అండగా ఉంటారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత పూర్తిస్థాయిలో ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను తీర్చిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అని మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు కంబాల పరమేష్, జడ్పీటిసి దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు తమ ఇష్టారీతిన మాట్లాడితే సహించబోమని వారికి తగిన గుణపాఠం ప్రజలే చెప్తారని హెచ్చరించారు. ముచ్చటగా మూడోసారి సీఎం పీఠంపై కెసిఆర్‌ను కూర్చోపెట్టడానికి తామంతా పని చేస్తామన్నారు. తెలంగాణ రైతులకు రైతు బాంధవులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేకంగా కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు, రైతుల పక్షాన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రైతులతో కలసి కడ్తాల్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటిసి దశరథ్‌నాయక్, డిసిసిబి డైరెక్టర్ ఆమన్‌గల్, కడ్తాల్ మండలాల పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్, రైతు సమన్వయ సమితి కడ్తాల్ మండల అధ్యక్షులు జోగు వీరయ్య, సర్పంచ్‌లు యాదయ్య, సులోచన,సాయిలు, ఎంపిటిసిలు చంద్రమౌళి, లచ్చిరాంనాయక్, ప్రియ రమేష్, బొప్పిడి గోపాల్, వివిధ గ్రామాల ఉపసర్పంచ్‌లు వినోద్, సీనియర్ నాయకులు ముత్తికృష్ణ, గోపాల్, యాదయ్య, రాజుగౌడ్, వార్డు సభ్యులు బిక్షపతి, మహేష్ హెచ్ఆర్, రామచంద్రయ్య, వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహేష్ యాదవ్, పాండునాయక్, బిఆర్ఎస్ నాయకులు ఎర్ర రామకృష్ణ, మల్లేష్, అంజి, కృష్ణ,శివ, శ్రీకాంత్, మహేష్, వేణు, జగన్ తదితరులు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

